ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

# ముఖ్యాంశాలు

- ❖ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ విద్యుత్ సమస్యల పరిష్కారానికి 5 వేల 500 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.
- ❖ ధన్వంతరి జయంతి సందర్భంగా ప్రతి ఏటా సెప్టెంబర్ 23న జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం.
- ❖ వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రేపు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగిన వైద్య ఆరోగ్య శాఖపై చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల కంటే ఆంధ్రప్రదేశ్ లో ఆరోగ్య మౌలిక వసతుల కల్పన మెరుగ్గా ఉందని తెలిపారు. ఇప్పటివరకు 78 శాతం హెల్త్ రికార్డులను డిజిటలైజేషన్ చేశామని, త్వరలో 100 శాతం పూర్తి చేస్తామన్నారు. ఇటీవల కాలంలో సీజేరియన్ కాన్పులు ఎక్కువగా జరుగుతున్నాయని, సాధారణ కాన్పులు చేసే విధంగా వైద్యులు శ్రద్ధ వహించాలని ముఖ్యమంత్రి సూచించారు.

==========================

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 5 వేల 500 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్లకు సంబంధించి శాసనమండలిలో ఈరోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ... పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా, భవిష్యత్ అవసరాల కోసం 14 ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ పనులన్నీ

పూర్తయితే లో ఓల్టేజ్ సమస్య కూడా తగ్గుతుందని మంత్రి వెల్లడించారు. విశాఖపట్నం వంటి పట్టణాలలో వర్షాలు పడేప్పుడు, ఇతర సమయాల్లోనూ విద్యుత్ అంతరాయాల సమస్యలను పరిష్కరించడానికి స్కాడా సెంటర్ ను ఏర్పాటు చేశామని మంత్రి వివరిస్తూ…

(వాయిస్ 32 సెకన్లు)

==========================

దేశంలో పన్నుల సంస్కరణలలో భాగంగా 79 సంవత్సరాల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నూతన విప్లవాన్ని తీసుకువచ్చారని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ ను ఆయన ఈరోజు కలిశారు. అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ… ప్రపంచానికి ఆదర్శవంతమైన GSTని GST -2.O పేరుతో కేంద్ర ప్రభుత్వం పేదలకు సంబంధించిన వస్తువులపై పన్నులను తగ్గించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ దేశీయ వస్తువులనే వినియోగించాలని విష్ణువర్ధన్ రెడ్డి కోరారు.

==========================

శ్రీ సత్య సాయి జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో `పోషణ్ మాహ్` కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. మహిళల్లో పోషకాల లోపం తలెత్తకుండా అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. పుట్టపర్తి మండలం ప్రశాంతి గ్రామం, మామిళ్ళకుంట క్రాస్ లోని అంగన్వాడీ కేంద్రాలలో జరిగిన కార్యక్రమంలో చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (CDPO) జయంతి పాల్గొని.. పోషకాల లోపం వల్ల కలిగే అనర్థాలను తెలియజేసి, పోషక పదార్థాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని మహిళలకు సూచించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో చిన్న పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం PP1, PP2 పుస్తకాలను పంపిణీ చేసి వారి మేధాశక్తిని పెంపొందించడానికి కృషి చేస్తుందని తెలిపారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో… గత 11 సంవత్సరాలుగా భారతదేశం అనేక రంగాలలో విశేష ప్రగతిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయి. ఈ వార్తా విశేషాలను “సేవా పర్వ్” పేరుతో ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలుగా అందిస్తోంది. అందులో భాగంగా వ్యవసాయ రంగంలో సాంకేతికతను ప్రవేశపెడుతూ ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం…

(వాయిస్ 91 సెకన్లు)

==========================

ఆయుర్వేదం ఆవశ్యకతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి డాక్టర్ టి.హేమాక్షి తెలిపారు. 10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఈరోజు సీతానగరం మండలం బూర్జ ఆయుర్వేద వైద్యశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ… ధన్వంతరి జయంతి సందర్భంగా ప్రతి ఏటా సెప్టెంబర్ 23వ తేదీన జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఆయన బాల్యానికి సంబంధించిన ఇతివృత్తంతో నిర్మించిన “చలో జీతే హై” లఘు చిత్రం దేశవ్యాప్తంగా పలు థియేటర్లలో ప్రదర్శించబడుతుంది. ఈనెల 17న ప్రారంభమైన ఈ లఘు చిత్ర ప్రదర్శన రేపటి వరకు కొనసాగుతుంది. ఈ చిత్రానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పిల్లలు సైతం ఈ చిత్రాన్ని

చూసి ప్రేరణ పొందుతున్నారు. విశాఖ నగరంలోని ఈ చిత్రాన్ని వీక్షించిన చింతాడ భరద్వాజ ఆకాశవాణితో మాట్లాడుతూ…

(వాయిస్ 27 సెకన్లు)

==========================

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో రేపు రాష్ట్రంలో పలు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారిణి జి.లక్ష్మి తెలియజేశారు.

==========================

==========================